క్లుప్తంగా

సీసీ రహదారి పరిశీలన



సీసీ రహదారి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదపాడు: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. మండలంలోని కొత్తముప్పర్రు గ్రామంలో ఇటీవల చేపట్టిన సీపీ రహదారి పనులు దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పరిశీలించారు. 21లక్షల వ్యయం గ్రామ సచివాలయ నిధులతో సుమారు 450 మీటర్ల మేర నిర్మాణం చేసిన కాంక్రీటు రోడ్డును పరిశీలించారు. చేపట్టిన పనులను ఏఎంసీ అధ్యక్షుడు అప్పన ప్రసాద్ అబ్బయ్యచౌదరికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, కోట గోవర్ధన్ ఇతర గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



పోతునూరులో గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేస్తున్న దృశ్యం

దెందులూరు:గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. పోతునూరు ఎస్సీ ఏరియాలో గ్రావెల్ రోడ్డును నిర్మిస్తున్నామని పోతునూరు గ్రామ సర్పంచ్ బోదుల స్వరూప్ అన్నారు. సోమవారం పోతునూరులో స్థానికుల ప్రయాణ అవసరాలను దృష్టిలో పెట్టుకుని గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులు ఆమె ప్రారంభించారు. ఈకార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

డాగూరే సేవలు చిరస్మరణీయం



డాగూరే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

భీమడోలు : ఫొటోగ్రాఫర్ల ఆరాధ్యదైవం, ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగూరే సేవలు చిరస్మరణీయమని భీమడోలు సర్కిల్ ఫొటో గ్రాఫర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ద్రాక్షారపు శ్రీరామ్ అన్నారు. భీమడోలు బైపాస్ రోడ్డు వద్ద సోమవారం ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో లూయిస్ డాగూరే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లూయిస్ డాగూరే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ కెమెరా సృష్టికర్త డాగూరే ప్రతి ఫొటోగ్రాఫర్ ఆరాధ్యదైవమని, ప్రపంచంలోని కోట్లాది కుటుంబాలు ఫొటోగ్రఫీని జీవనోపాధిగా ఎంచుకుని జీవనం సాగిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పిల్లి బ్రహ్మం, డి.డేవిడ్, ఉపాధ్యక్షుడు ప్రభు, కోశాధికారి లీలా కృష్ణ, ఉప కార్యదర్శి కృష్ణ, సభ్యులు నరేష్, శ్రీను, నాగరాజు, చిన్ని, రాంబాబు, సాయి తదితరులు పాల్గొన్నారు.

నేర నియంత్రణకు పటిష్ట చర్యలు



నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో గంజాయి రవాణా, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు సబ్‌డివిజన్, కైకలూరు సర్కిల్ పరిధిలోని పోలీస్ అధికారులతో నేర సమీక్ష చేశారు. గంజాయి, సారా, మత్తు పదార్థాల రవాణా చేసేవారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. నిత్యం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. ప్రతి మంగళవారం స్టేషన్ హౌస్ ఆఫీసర్ సమావేశం నిర్వహించి, మహిళా సంరక్షణ కార్యదర్శులకు దిశానిర్దేశం చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారులపై నిత్యం రాత్రివేళల్లో వాహన తనిఖీలు, ఫేస్ వాష్ నిర్వహించాలన్నారు. రాత్రి, పగలు పోలీస్ బీట్స్‌ను బలోపేతం చేయాలని సూచించారు. రక్షక్, బ్లూకోల్ట్స్ వాహనాలు నిత్యం పెట్రోలింగ్ చేయాలన్నారు. మహిళల ఫిర్యాదులపై సకాలంలో న్యాయం చేయాలని, మిస్సింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. స్పందనలో ఫిర్యాదులను కాలపరిమితిలోపు పరిష్కరించాలన్నారు. అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, సీఐలు, డీసీఆర్‌బీ సీఐ దుర్గాప్రసాద్, ఎస్సై సాదిక్ తదితరులు ఉన్నారు.

పవన్ వ్యాఖ్యలపై నిరసనలు

దెందులూరు: వలంటీర్ల అనుచిత వ్యాఖ్యలను పవన్ కల్యాణ్ వెనక్కి తీసుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టా ఏసుబాబు, చల్లా మేరీరాజు డిమాండ్ చేశారు. సోమవారం దెందులూరు వైఎస్సార్ జగనన్న బస్టాండ్ సెంటరు వద్ద ఆందోళన నిర్వహించారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తోన్న తమపై నీచమైన వ్యాఖ్యలు చేయడం పవన్‌కు తగదని హితవు పలికారు. అనంతరం పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. వలంటీర్లకు క్షమాపణ చెప్పకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఏఎంసీ డైరెక్టర్ పులిపాటి శ్యామలాదేవి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పులిపాటి ఆనంద్, వైఎస్సార్‌సీపీ నాయకులు కట్టా వెంకట సుబ్బారావు, నాయుడు గణపతి, తదితరులు ఉన్నారు.



దెందులూరు జగనన్న బస్టాండ్ సెంటరులో పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

పవన్ కళ్యాణ్‌ను అరెస్ట్ చేయాలి

భీమడోలు : ప్రజాసేవే పరమావధిగా పనిచేస్తున్న వలంటీర్లను అవమానించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వలంటీర్లను మహిళా బ్రోకర్లుగా నిందించిన కుసంస్కారి పవన్ అన్నారు. మతిభ్రమించిన పవన్ కళ్యాణ్ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై మాట్లాడే దమ్ము లేక వలంటీర్లపై అక్కసుతో నిరాధార ఆరోపణలు చేయడం ఆతని నీచ సంస్కృతికి నిదర్శనమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిని ఇంటింటికీ చేరవేస్తున్న వలంటీర్ల సేవలను దేశంలో పలు రాష్ట్రాల్లో అమలు చేసేందుకు ముందుకు వస్తుంటే పవన్ కళ్యాణ్ ఎవరో ఇచ్చిన స్క్రిప్టును చదవుతున్నాడన్నారు. దేశ ప్రధానితో పాటు ఇతర రాష్ట్రాలు సైతం జగనన్న అమలు చేస్తున్న పథకాలు మెచ్చుకుంటే పవన్ కళ్యాణ్, చంద్రబాబు వలంటీర్ల వ్యవస్థపై విషం కక్కుతున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో వలంటీర్లే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పార్టీలను ఓడించి భూస్థాపితం చేయడం ఖాయమన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

భీమడోలు : పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని ఎంపీపీ కనమాల రామయ్య అన్నారు. గుండుగొలను నెం.1 సచివాలయం వద్ద సోమవారం జగనన్న సురక్షా కార్యక్రమం ఉపసర్పంచ్ ఎం.సూర్యనారాయణరాజు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ కనమాల రామయ్య, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్ హాజరయ్యారు. ఎంపీపీ రామయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలనను సాగిస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించిందని, మిగిలిన ఒక్క శాతం కూడా అర్హత కలిగిన వారికి సంక్షేమ లబ్ధి అందించేందుకు ప్రభుత్వం జగనన్న సురక్షా పథకం ద్వారా జల్లెడ పట్టి అందించడం శుభపరిణామన్నారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఈ గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలకు పెద్ద పీట వేశారన్నారు. గ్రామంలోని వెయ్యి మందికి ఇండ్ల స్థలాలతో పాటు ఇళ్ల నిర్మాణాలకు నిధులను అందించడం జరిగిందని, జాతీయ రహదారి పక్కనే ఉన్న గోదావరి కాల్వపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారన్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా గ్రామంలో గుండుగొలనులో కోట్లాది రూపాయలతో సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నారన్నారు. గ్రామ ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో గుండుగొలను అభివృద్ధికి ఎమ్మెల్యే వాసుబాబు విశేష కృషి చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను ప్రజలంతా దీవించాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు 546 ధ్రువీకరణ పత్రాలను అందించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ డోకల వాసంతి, మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, ఎంపీటీసీలు నత్తా నాగిని, వెంకటేశ్వరమ్మ, జిల్లా వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ జహీర్, జిల్లా నాయకులు వగ్వాల అచ్యుతరామారావు, నాయకులు గొటికల మురళీ, నల్ల శంకర్, నల్ల శ్రీను, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



గుండుగొలనులో అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి
- పాతముప్పర్రులో గడపగడపకు మన ప్రభుత్వం

పెదపాడు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదపాడు మండలంలోని పాతముప్పర్రు గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గడపగడపకూ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు అడిగిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలుకు సంక్షేమ పథకాల ద్వారా ప్రతీ ఇంటికి రూ.1లక్ష నుంచి రూ.6లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. అమ్మవడి పథకం ద్వారా రూ.15వేలు, చేయూత పథకం ద్వారా ఏటా రూ.18,500లు, సామాజిక భద్రతా పింఛన్ ద్వారా 2,750లు, ఆటోడ్రైవర్లుకు రూ.10వేలు, చేయూత పథకం ద్వారా దర్జీలకు, ఇస్త్రీ పనివారికి రూ.10వేలు అందిస్తూ వైఎస్సార్ ఆసరా పథకంలో ఏటా రూ.5వేల నుంచి రూ.2లక్షల వరకు మాఫీ చేసామన్నారు. ప్రజలకు ఎవరు మంచి చేస్తున్నారో గుర్తు చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. గ్రామంలో డ్రెయినేజీ, రహదారి నిర్మాణం చేయాలని, ఇళ్ల రుణాలు ఇవ్వాలని ప్రజలు కోరడంతో వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జగనన్న సురక్ష పథకం ద్వారా వివిధ సర్టిఫికెట్ల కారణంగా నిలిచిపోయిన సంక్షేమ పథకాలను పునర్ధరించేందుకు చర్యలు చేపట్టేందుకు జగనన్న సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, జిల్లా రైస్ మిల్లర్ల అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, మండల సచివాలయాల కన్వీనర్ అక్కినేని గోపీ, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, సర్పంచ్ మెదబలిమి స్వరూపరాణి సంతోష్ కుమార్, స్థానిక నాయకులు గొట్టాపు నర్సింహరావు, కొండేలాజరు, బత్తుల ఏసురాజు, కోట గోవర్ధన్, పూడి రంగప్పారావు తదితరులు పాల్గొన్నారు.



పాతముప్పర్రు గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్ అందజేస్తున్న దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

భీమడోలు : బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేరిపించాల్సిన బాధ్యత టీచర్లపై ఉందని భీమడోలు ఎంఈవో 1 ఏవీఎస్ఎస్ భాస్కర్‌కుమార్ అన్నారు. భీమడోలు ఎంఆర్సీలో సోమవారం మండల స్థాయిలో ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. భీమడోలు ఎంఈవో 1 ఈ.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగి సమావేశంలో పలు అంశాలపై ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వ పథకాలు, సర్కారీ బడుల్లో విద్యార్థుల చేరిక, జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ, నాడు-నేడు పనుల ప్రగతి, వర్షాకాలం నేపథ్యంలో పాఠశాలల్లో భద్రత చర్యలు తదితర అంశాలపై సమీక్షించారు. భాస్కర్‌కుమార్ మాట్లాడుతూ గ్రామ వలంటీర్ల సహకారంతో ఐదేళ్ల నిండి 18 ఏళ్ల లోపు వారందరిని విధిగా ప్రభుత్వ బడుల్లో చేర్పించాలన్నారు. జగనన్న విద్యా కానుక కిట్లను ప్రతి విద్యార్థికి అందించాలని, వారి నుంచి విధిగా బయోమాట్రిక్ తీసుకోవాలన్నారు. మండలంలో ఇప్పటివరకు 90శాతం నమోదు అయ్యిందన్నారు. చిన్నారుల్లో చదవడం రాయడం, మాట్లాడం వంటి ప్రక్రియలను నేర్పించాలన్నారు. నాడు నేడు పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రతి పాఠశాలలో భద్రతా చర్యలపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వంట గదులు, తరగతి గదుల్లో విష కీటకాలు చేరకుండా చూడాలన్నారు. విద్యుత్ సరఫరాలోని లోపాలు, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలన్నారు. వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది సుమలత, సీఆర్‌పీ ఎన్‌వీఎస్ సత్యప్రసాద్, రమణ, రాధాకృష్ణ పాల్గొన్నారు.



హెచ్‌ఎంల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో భాస్కర్‌కుమార్

గర్భిణుల ఆరోగ్య పరిరక్షణకు కృషి

భీమడోలు : గర్భిణుల ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద పీట వేస్తున్నాయని గుండుగొలను పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్ అన్నారు. గుండుగొలను పీహెచ్‌సీలో సోమవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 32 మంది గర్భిణులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందించారు. తొలి కాన్పు 21 మంది, రెండు, మూడు కాన్పులు 11 మందికి వైద్యం, ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించారు. 13 మంది హైరిస్క్ గర్భిణీ స్త్రీలుగా గుర్తించారు. వారికి స్కానింగ్ పరీక్షలు నిమిత్తం ఈనెల 14వ తేదీన ఏలూరులోని ఆశ్రం ఆసుపత్రికి ఉచిత బస్సులో ఆశ కార్యకర్తలు తీసుకువచ్చి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పోష్టికాహారాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఓ.అన్నపూర్ణ, ఎంపీహెచ్ఈవో సీహెచ్ శ్రీనివాసరావు, హెచ్ఈ కె.మల్లేశ్వరి, సూపర్‌వైజర్ ఎస్‌కే నవీన్, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



గుండుగొలను పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్

నేడు అప్పారావుపేటలో 'గడపగడపకు'

ఉంగుటూరు : మండలంలోని అప్పారావుపేట, తల్లాపురం గ్రామాలలో మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసు బాబు పాల్గొని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు పెరుగ్గూడెంలో ఎమ్మెల్యే ప్రారంభోత్సవాలు

దెందులూరు: మండలంలోని పెరుగ్గూడెం గ్రామంలో మంగళవారం నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాలు, సీసీ రోడ్లను దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రారంభోత్సవం చేస్తారని పార్టీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జిల్లా కమిటీ సభ్యులు యలమర్తి రామకృష్ణ, గ్రామ సర్పంచ్ యలమర్తి రేవతి తెలిపారు. ఈ కార్యక్రమాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు అధికారులు హాజరై విజయవంతం చేయాలని సర్పంచ్ రేవతి కోరారు.

జగనన్న సురక్ష ప్రజలకు వరం



గోపన్నపాలెంలో మొక్కలు నాటుతున్న మండల ప్రత్యేకాధికారి కృపావరం, తహసీల్దార్ నాంచారయ్య, ఎంపీడీఓ లక్ష్మి, సర్పంచ్ కోటేశ్వరమ్మ



పెదపాడు మండలం ఎస్ కొత్తపల్లి గ్రామంలో జగనన్న సురక్ష పథకంలో ధ్రువపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు

దెందులూరు: జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలందరికీ వరమని దెందులూరు మండల ప్రత్యేకాధికారి కృపావరం అన్నారు. సోమవారం గోపన్నపాలెంలో గ్రామ సర్పంచ్ కోటి నాగమల్లేశ్వరికుమార్ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ధ్రువీకరణ పత్రాలు మంజూరు, స్వీకరణ జరిగింది. అనంతరం అధికారులు, ఎంపీటీసీలు ఏనుగు అంజలిప్రసాద్, సువ్వా ప్రభుదాసు, గ్రామ కమిటీ అధ్యక్షుడు వీరంకి సత్యనారాయణ, సర్పంచ్ కోటేశ్వరమ్మ, గ్రామ కార్యదర్శి స్టానిషబాబు తదితరులు మొక్కలు నాటారు.

జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పెదపాడు: జగనన్న సురక్ష పథకం సక్రమంగా అమలు జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్ తెలిపారు. పెదపాడు మండలంలోని సకల కొత్తపల్లి గ్రామంలో జగనన్న సురక్ష శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అప్పన ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన పథకాలను అందించేలా ముందస్తు సర్వే నిర్వహించాలన్నారు. ముందస్తుగా వలంటీర్లుకు కేటాయించిన ఇళ్లకు వెళ్లి వారికి సురక్ష పథకంపై అవగాహన చేసి, వారికి ఏ ధ్రువప్రతం అవసరమో తెలుసుకోవాలలన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ అక్కినేని గోపీ, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి, గ్రామ సర్పంచ్ చేపేని రంగారావు, తహసీల్దార్ ఎం విజయకుమార్‌రాజు, ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



కాగుపాడులో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

ప్రజల సమస్యలు తెలుసుకొనేందుకే జగనన్న సురక్ష

పెదవేగి : ఇచ్చిన మ్యానిఫెస్టోలో 98 శాతం హామీలను నెరవేర్చిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందని ఎంపీపీ తాతా రమ్య అన్నారు. పెదవేగి మండలంలోని వంగూరు గ్రామంలో జరిగిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో పాల్గొని సభను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ఇచ్చిన ప్రతీ హామీని ఎంతో పవిత్రంగా భావించి అర్హులకు అందించామని, అవి నేరుగా ప్రతీ గడపకు అందుతాన్నాయా లేదనే విషయంపై స్థానిక శాసన సభ్యులు కొఠారు అబ్బయ్యచౌదరి నేతృత్వంలో గడపగడపకు వెళ్తున్నామని చెప్పారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి సంక్షేమ పథకాల కింద రూ 15.31 కోట్లు వివిధ అభివృద్ధి పనుల కింద రూ. 11.51 కోట్లు మొత్తం రూ. 26.51 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, అయితే ఇంకా పూర్తి చేయవలసిన పనులు ఉన్నాయని ఆమె తెలిపారు. అనంతరం 770 ధ్రువపత్రాలను అర్హులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చీలి రూతు జోసెఫ్, ఎంపీడీఓ, పచ్చ శంకర్, అధికారులు పాల్గొన్నారు.

పెదకడిమిలో..

గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లామని కొప్పాక సొసైటీ అధ్యక్షుడు చళ్ళగొళ్ల వెంకటేశ్వరరావు(భూస్వామి) అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 11 రకాల సేవలకు సంబంధించిన ధ్రువపత్రాలను తహసీల్దార్ ఎస్ నాగరాజు ఆధ్వర్యంలో భూస్వామి ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా భూస్వామి మాట్లాడుతూ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఆధ్వర్యంలో నెల రోజుల పాటు జరిగే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అర్హులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొప్పాక సొసైటీ అధ్యక్షుడు చళ్ళగొళ్ళ భూస్వామి, పర్వతనేని నాగయ్య, పర్వతనేని కృష్ణారావు, చలసాని వెంకటరావు, నందిగాం శ్రీనివాసరావు, కొల్లి రాజేష్‌బాబు, అన్నపనేని పెదబాబు, గోళ్ళ మంగయ్య, నెరుసు వెంకటసత్యనారాయణ, ఇతర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో పేదలకు మేలు

ఉంగుటూరు : జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజా సమస్యలను పరిష్కరించి, పేదలకు లబ్ధి చేకూర్చేందుకు దోహదపడుతుందని ఉంగుటూరు మండల ప్రత్యేక అధికారి, డీఎల్‌డీవో గుండవరపు వెంకటరమణ అన్నారు. సోమవారం రావులపర్రు, కాగుపాడు గ్రామాలలో జగనన్న సురక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలలో డీఎల్‌డీవో రమణ మాట్లాడుతూ సాంకేతిక కారణాల వల్ల గతంలో నిలిచిపోయిన పథకాలకు అర్హత లభిస్తుందని, ఫలితంగా పేదలకు సంక్షేమ లబ్ధి అందుతుందన్నారు. అలాగే గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎటువంటి రుసుము చెల్లించకుండా ఉచితంగా కుల, ఆదాయం, నివాసం, తదితర సర్టిఫికెట్లు గ్రామంలోనే అందించటం వల్ల వ్యయప్రయాసలు తగ్గి ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే వాసుబాబుకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 440 సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమాలలో వైఎస్సార్ సీపీ నాయకడు పుప్పాల చిన్నబాబు, పార్టీ మండల కన్వీనర్ మరడ మంగరావు, పార్టీ సచివాలయాల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, పార్టీ పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, పార్టీ వీవర్స్ జిల్లా అధ్యక్షుడు దొంతంశెట్టి సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ మరడ రమావతి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో మల్లేశ్వరరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో ఆంజనేయులు, పార్టీ రావులపర్రు నాయకుడు గాది వెంకటరమణ, పైడి రంగరావు, సర్పంచ్‌లు పైడి వెంకటరమణ, కడియాల సుధీష్ణ, కంబంపాటి సత్యవతి పాల్గొన్నారు.



వంగూరు పంచాయతీ ఆవరణలో మొక్క నాటుతున్న ఎంపీపీ, సర్పంచ్, అధికారులు, నాయకులు



పెదకడిమిలో అర్హులకు ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు

హెల్పర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

దెందులూరు: మండలంలోని అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని పెదపాడు సీడీపీఓ కే.విజయలక్ష్మి అన్నారు. సోమవారం మాట్లాడుతూ శ్రీరామవరంలోని 121వ కోడ్‌లో ఎస్సీ రిజర్వేషన్, దోసపాడులో 157 కోడ్‌లోని అంగన్‌వాడీ కేంద్రానికి ఓసీ రిజర్వేషన్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 21-35 సంవత్సరాలలోపు వయస్సు ఉండాలన్నారు. ఈ నెల 15వ తేది సాయంత్రం 5 గంటలకు గడువు ముగుస్తుందని, దరఖాస్తులను సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

జగనన్న విద్యాకానుక కిట్లను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి

పెదపాడు : విద్యార్థులకు అందించిన జగనన్న విద్యాకానుక కిట్‌లు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని ఎంఈఓలు సబ్బితి నర్సింహమూర్తి, దేవినేని రమణ తెలిపారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ విద్యార్థులకు సంబంధించిన వివరాలు నూరు శాతం నమోదు చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదపాడు మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు దెందులూరులో జగనన్న సురక్ష

దెందులూరు: దెందులూరులో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు, ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి తెలిపారు. దెందులూరు, అలుగులగూడెం, సత్యనారాయణపురం, అప్పారావుపాలెం గ్రామ ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియో గం చేసుకోవాలన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్ని శాఖల అధికారులు పాల్గొంటారన్నారు.